# మనిషిలో మనిషి

"చంద్రకాంత"

అర్ధరాత్రి దాటింది. అతడు ఇల్లు సమీపించాడు. చీకటి. అయినా ఎక్కడనుంచో వెలుగు. అది వెలుగూ అనలేము. కాని, ఛాయలు మాత్రం కనపడుతున్నాయి.

ఇల్లు భూతంలాగ నిలబడింది. దానికి చుట్టూ పిశాచాలు కాపలా కాస్తున్నాయి. ఇంట్లో బతుకుతూ మెదులుతున్న జీవాలు లేవో!

వీధిగేటు—లోపల—తాళంవేసివుంది. పిలవడం అలవాటు మానుకున్నాడు ఏనాడో. గేటు దూకి లోన ప్రవేశించాడు. ఒకసారి తలుపు గీరాడు. ఒక నిమిషం అటూ ఇటూ పదడుగులు వేశాడు. తన బూటు చప్పుడు ఆ చీకటి నిశ్శబ్దంలో పర్లాంగుదూరం వినపడుతుంది.... ఈ మాటు తలుపు దబదబ తట్టేడు.

తలుపు తెరచింది—దెయ్యందాసీది. పాడు మొహం. నిద్ర లేచి కళ్ళు తెరిచేసరికి అయ్యే దర్శనం ఈ అమ్మావారిది. నిద్రపోయేముందు ఆఖరి జోలపాట ఈ నూకాలమ్మది—శింగినాదమ్మ!

ఎలక్ట్రీదీపం వెలిగింది. మరొక్కనిమిషంలో ఇంటో రెండు మూడు దీపాలు వెలిగేయి. తను పడకగదికేసి వెడుతున్నాడు. అతని భార్య వంటగది తలుపు తెరుస్తోంది. ఆ సాయంత్రం ఆమె తలలో ముడుచుకున్న మల్లెచెండు—నలిగివుంది.

గదిలో—అతను బూటు విప్పుకుంటున్నాడు. టేబుల్ దగ్గర—కింద నేలమీద—కవరు పడివుంది. ఎత్తిచూశాడు. అది తనదే. అందులో ఫొటో...."మీ కోసం—కల్యాణి" అక్షరాలు.

అతని ముఖం ముడతలు పడింది. ఇది ఇక్కడికి ఎందుకు వచ్చింది? ఎలాగ వచ్చింది? ఎక్కడో ఒక మూల డ్రాయర్లో దాచివుంచిన ఈ ఫొటోను ఆమెగారు బయటకు లాగింది!

'ఈమెగారు పరిశీలిస్తున్నారు కాబోలు,' అనుకున్నాడు. అతని తలలో—మనసులో—పాత పురాణాలన్నీ ఒక్కటొక్కటే పడగలెత్తి ఆడుతున్నాయి. కల్యాణి—అతని విషాదాంత నాటకంలో మూడో అంకంలో రెండో రంగంలోని ప్రధానపాత్ర. ఈ ఫొటో తనకు చేరి సరిగ్గా రెండు రోజులయింది. 'అప్పుడే ఆమె చేత పడింది. రంకుతనం పెంచుతోంది. అక్కర్లేని వాటి జోలికి వెళ్ళవద్దని ఎన్నిసార్లు చెప్పినా.' ఆమెను తిట్టుగుంటున్నాడు.

భోజనం చేస్తున్నాడు, ఆమెకూడా భోజనం చేస్తోంది. నిద్రమత్తు ఇంకా ఆమెను వదలినట్లు లేదు. రాత్రి కల్పించిన చీకటి నిశ్శబ్దంలో వారిద్దరూ ప్రధాన పాత్రలు.

ఆమె ఏమీ ఎరగనట్లుంది.

అతని మనస్సులో ఉపన్యాసాలు చెలరేగుతున్నాయి—

'అంతా నటన....రంకుతనం కడుతుంది! కొంప ములిగిందేమిటో! ఈ వేళ-ఇంతరాత్రివేళా బయలుదేరి వెళ్ళి ఆ కల్యాణిదగ్గిర కూర్చుంటే ఏం చేస్తుందో! లేక దాన్నిక్కడికి తీసుకు వచ్చేస్తేనో....నటిస్తోంది.... ఒరేయ్ నీ, వ్యవహారం అంతా మనికి తెలుసునురా అని చెప్పడం—అదంతా!'

లెఖప్రకారం భోజనాలయ్యాయి. అతను పడకగది చేరాడు. ఆమెను. ఆమె అన్నీ సవి

రించుకుంటోంది. దాసీది సెలవు పుచ్చుకుంది. ఆమె రెండుసార్లు గదిలో బల్లదగ్గిరికి వచ్చింది. ఇంకా ఆ ఫొటో బల్లమీదే వుంది. ఆమెకు దాని ప్రసక్తే పట్టినట్లు లేదు.

'ఇటువంటి వేషాలు భరించలేను. నన్ను నిలువునా తరిగెయ్యవచ్చు—నన్ను తిట్టవచ్చు—కుండ పగలకొట్టి అనేస్తే—స్వీకరించవొచ్చు.... ఈ స్వయంపాకం—ఈ కడుపులో పుండు—నే భరించలేను....'

అతని వొళ్లు భగ్గున మండిపోతోంది.

మంచంమీద పడుకుని, తలగడాలమీద ఆనుకుని పుస్తకం చదువుకుంటున్నాడు. ఆమె ప్రక్కనే కూర్చుని తమలపాకులందిస్తోంది.

ఒకసారి ఆమె పుస్తకం మీదకు తన చేతిని పోనిచ్చింది. చదువు ఆగింది. అతను విసుగుతో విసురుగా వున్నాడు.

'ఉన్నది ఉన్నట్లు అనెయ్—ముద్దుపెట్టుకుంటాను. కౌగలించుకుంటాను. వేషాలూ నటనా మానెయ్యి. నా సంగతి నీకు తెలుసు....' అని ఆమెను ఉద్దేశించి తనలో అనుకున్నాడు.

ఆమె పుస్తకం మెల్లగా చిరునవ్వుతో లాక్కుంది. అతని కళ్ళకు అడ్డంగా తన తలను పెట్టి. పుస్తకం పేజీలు తిరగవేస్తోంది.

ఇది ఆమెకు పరిపాటు. ఆమెకు ఇంగ్లీషు రాదు. కాని, కొన్ని మాటలు కూడబలుక్కోగలదు:

తన యిద్దరి పేర్లూ ఇటు తల్లి దండ్రుల పేర్లూ ఇంగ్లీషులో రాయగలదు. ఏ బీ సీ డీ లన్నీ బాగా వచ్చు. ఆ లెఖలో ఆ పుస్తకం పూర్తిగా చదవగలదు!

అతని కోపిష్టిస్వభావం....రకరకాలవుతోంది. విపరీతం అవుతోంది. ఆమె ఒక్కసారి అతని కళ్ళకేసి చూసింది.

పుస్తకం ఇచ్చివేసింది.

అతను చదువుకుంటున్నాడు.

గడియారం—ఒంటిగంట—

ఆమె తన మంచంమీదికి వెళ్లింది. పడుకుంది.

అతని శరీరం వెర్రులెత్తింది.

ఆమె కొంతసేపన్నా మాట్లాడితే ఏమయ్యేదో....అతను రాజీకి రాడు. ఎదుటివారికి వీలు కలుగనియ్యడు.

తనూ పడుకున్నాడు లైటు ఆర్పి,నిద్ర రాదు. నిద్రపోతున్నట్లు పడుకున్నాడు.

పావుగంట గడిచింది. లైటు వెలిగింది. ఆమె కాస్త ఇటూ అటూ మసిలింది. లైటు ఆర్పింది. కాని ఆమె వీధిగదిలోకి వెళ్ళింది. అక్కడి లైటు వెలిగింది.

అతను అంతా గ్రహిస్తూనే వున్నాడు, ఆమె ఏమి చేస్తోంది?....చాలా సేపు గడిచిపోయింది.... ఆమె ఏమిచేస్తోన్నట్లు.

అతనుకూడా లేచాడు. పుస్తకం పుచ్చుకుని వీధిగదిలోనికి వెళ్ళేడు. ఆమె ఏదో కాగితం మీద దీక్షగా రాస్తోంది. అతన్ని చూసి కంగారు పడింది. తను కుర్చీలో కూర్చుని చదవ నారంభించాడు. ఆమె చదీ చప్పుడూ కాకుండా కాగితం చింపి ముక్కలుచేసింది.

"వెళ్ళిపడుకో—" అన్నాడు తీవ్రంగా.

ఆమె ఒకంతట లేవలేదు.

"మూడు రోజుల్నీ తలనెప్పి అంటూ—" అన్నాడు.

"నిద్ర రావడంలేదు" అంది, దిగులుమొహంతో—ఆమె లేచి వెళ్ళిపోయింది.

మరి కాస్త సేపటికి తిరిగివచ్చి, అతని ప్రక్కనే నిల్చుంది. 'ఏం' అన్నట్లు తలెత్తి చూశాడు.

ఆమె జంకుతూ "ఏమీలేదు" అంటూ-అతని చేతిలో ఫొటో పెట్టింది—గజ గజ వణకింది.

అతను ఫెడేల్న ఆమె దవడమీద చరిచాడు.

ఆమె మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

అతను తోడేలులాగ ఒక్క యెరుగున వెళ్ళేడు. ఆమె చింపి పారేసిన ముక్కలన్నీతీశాడు. అవి పరిశీలిస్తున్నాడు. చాలా ముక్కలు ఉత్తివే. కొన్నిటిమీద అతని పేర్లు రాసివున్నాయి—ఒక దాని మీద—

"నన్ను—క్షమించం—

ఇంక ఎప్పుడూ—"